నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

అత్తాపూర్, మే 30: పలు విద్యుత్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జనప్రియ ఏబీసీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి 12 వరకు కేశవనగర్, కృష్ణానగర్, శివానగర్, మోర్ సూపర్‌మార్కెట్, గుమ్మకొండకాలనీ, అత్తాపూర్ ఫీడర్ పరిధిలో 11.30 గంటల నుంచి ఒంటి గంట వరకు ఈశ్వర్ థియేటర్, హైదర్‌గూడ, గాంధీ విగ్రహం, కాంతారెడ్డినగర్, రాధాకృష్ణనగర్, అంబియన్స్ ఫోర్ట్, జనప్రియ ఓహెచ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జనప్రియ అపార్ట్‌మెంట్, లక్ష్మినగర్, ప్లజెంట్ పార్కు, హైదర్‌గూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నలందానగర్, వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, డాక్టర్స్‌కాలనీ, సిరిమల్లేకాలనీ, లోటస్ స్కూల్, ప్లజెంట్ పార్కు, న్యూ ఫ్రెండ్స్‌కాలనీ, లక్ష్మినగర్ ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు నార్సింగి నూతన పాలకవర్గం ఎన్నిక

నార్సింగి మున్సిపల్ కార్యాలయం

మణికొండ, మే 30: నార్సింగి మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ఎన్నిక నేడు జరగనుంది. ఈనెల 18న జరిగిన అవిశ్వాస తీర్మానంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మెజార్టీ కౌన్సిలర్లు సిట్టింగ్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లపై పెట్టి అవిశ్వాసం నెగ్గారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నూతన పాలకవర్గాన్ని శుక్రవారం ఉదయం 10.30గంటలకు మెజార్టీ కౌన్సిలర్లు చేతులెత్తి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. ఈ ప్రక్రియ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో వెంకట్‌రెడ్డి సమక్షంలో జరగనుంది. మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా మంచిరేవుల 10వ వార్డు కౌన్సిలర్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా కోకాపేట 3వ వార్డు కౌన్సిలర్ విజయబాబు పేర్లను దాదాపు మెజార్టీ కౌన్సిలర్లు ప్రతిపాధించినట్లు తెలిసింది. అధికారుల సమక్షంలో అధికారికంగా ఎంపిక చేసి ప్రకటించే అవకాశం ఉంది.

యువకుడు అదృశ్యం

చింతకింది మహేశ్

మణికొండ, మే 30: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు కనిపించకుండాపోయిన సంఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలమాకుల గ్రామానికి చెందిన చింతకింది వెంకటయ్య కుమారుడు చింతకింది మహేశ్(21) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 21న ఉదయం ఇంటి పక్కన ఉన్న చింతల రవి వద్ద బైక్ తీసుకొని వెళ్లాడు. మరుసటి రోజు రవి మహేశ్‌కు ఫోన్ చేసి బైక్ గురించి అడిగాడు. దారిలో ఉన్నానని కొద్ది సేపట్లో ఇంటికి వస్తానని చెప్పాడు. కానీ మహేశ్ ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం ప్రియులు.. మత్తులో చిత్తు

- నార్సింగి చౌరస్తాలో తప్పతాగి పడిపోతున్న వైనం
- పీకలదాక మద్యం తాగి ఇటీవల ఓ వ్యక్తి మృతి
- 'మామూలు'గా తీసుకుంటున్న ఎక్సైజ్, ట్రాఫిక్ పోలీసులు

నార్సింగి-మంచిరేవుల చౌరస్తాలో మద్యం మత్తులో సాయంత్రం వరకూ రోడ్డుపైనే పడి ఉన్న వ్యక్తులు

మణికొండ, మే 30: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మద్యం దుకాణదారుల విచ్చలవిడి తనంతో మద్యం ప్రియులు రోడ్లపై పడి ప్రాణాలను పోగొట్టుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. పూర్తి వివరాలల్లోకి వెళితే.. నార్సింగి-మంచిరేవుల చౌరస్తాలో ఉన్న ఓ మద్యం దుకాణానికి ఎలాంటి అనుమతులు లేకుండానే ఓపెన్ సిట్టింగులను ఏర్పాటు చేసి కొన్నిరోజులుగా నడుపుతున్నారు. ఇదేకాకుండా రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను నిలిపి మద్యం విక్రయాలు జరుపుతున్నారు. దీనికి తోడు నిత్యం పదుల సంఖ్యలో మద్యం ప్రియులు పీకలదాక మద్యం తాగి రోడ్లపై పడిపోయి వాహనాల రాకపోకలకు తీరని ఇబ్బందులను కలిగిస్తున్నారు. ఇటీవల మద్యం షాపు లో పీకలదాక తాగి ఆపై రోడ్డు పక్కనే ఉన్న వ్యాపార కేంద్రాల వద్దకు చేరుకుని మత్తులో నిద్రపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇలాంటి ఘటనలు నార్సింగి-మంచిరేవుల చౌరస్తాలో ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో కొనసాగుతున్న భవన నిర్మాణాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగించే వలసకూలీలు అధికశాతం ఈ మద్యం దుకాణానికి వచ్చి దిక్కుతోచని స్థితిలో రోడ్లపై పడిపోతున్నారు. వైన్‌షాపు నిర్వాహణ నిబంధనలు పాటించకుండానే నిర్వాహకులు విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుపుతున్నారు. ఫలితంగా రోడ్డుపై వెళ్లే వాహనదారులకు నిత్యం సమస్యలు తప్పడం లేదు. మద్యం షాపు ముందు ఎక్కడపడితే అక్కడ మద్యం ప్రియులు పడిపోయి దర్శనమిస్తుంటారు. ఇదే మిటనీ ప్రశ్నించేవారే స్థానికంగా కరువైయ్యారు. ఓ వైపు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాల్సిన ఆ శాఖ పోలీసులు మాములుగా తీసుకోవడంతో పాటు ఎక్సైజ్‌శాఖ సైతం అదేదారిలో నడుస్తుందని స్థానికు లు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నకయాతన అనుభవిస్తున్నామని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్, ఎక్సైజ్‌శాఖ అధికారులు సకాలంలో స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్పా సెంటర్‌లో తనిఖీలు

ఖైరతాబాద్, మే 30: సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ స్పా సెంటర్‌పై పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమృత క్యాసిల్ హోటల్‌లో కొంత కాలంగా మేఘావి పేరుతో స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం పోలీసులు ఆ సెంటర్‌పై దాడి చేసి తనిఖీలు చేపట్టగా, సరైన రిజిస్టర్ నిర్వహించడం లేదని, నిబంధనలు పాటించడం లేదని గుర్తించారు. ఈ మేరకు స్పా సెంటర్ మేనేజర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హేమావతినగర్‌లో కలుషిత నీటి సరఫరా

జీఎం హరిశంకర్‌కు కలుషిత నీటి సమస్యను వివరిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ సంజీవ

జూబ్లీహిల్స్, మే 30: ఎర్రగడ్డ డివిజన్ హేమావతినగర్‌లో కలుషిత నీటి సమస్యలను బీఆర్ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ డి.సంజీవ జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ దృష్టికి తీసుకొచ్చారు. గురువారం జీఎం కార్యాలయంలో కలిసి కలుషిత నీటి నమూనాను పరిశీలన నిమిత్తం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కూలిపోయే వృక్షాలివే..

- యూసుఫ్‌గూడలో ఇప్పటికే 31 చెట్ల గుర్తింపు
- కమిషనర్ అనుమతితో తొలగింపునకు చర్యలు

జూబ్లీహిల్స్, మే 30: నగరంలో ప్రమాదకరంగా మారుతున్న చెట్ల సర్వేకు జీహెచ్ఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు. గాలి, వర్షాలకు చెట్లు పడిపోతూ ప్రమాదాలకు కారణమవుతున్న విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరికొన్ని ఘటనల్లో వాహనాలు ధ్వంసం అయ్యాయి. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పడిపోయిన చెట్లను, కొమ్మలను యూబీడీ విభాగం అధికారులు యుద్ధప్రాతిపదికన తొలగించారు. అయితే మరికొన్ని చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయని అధికారులు గుర్తించారు. నైరుతి రుతుపవనాలు సమీపిస్తుండడంతో ఆయా చెట్లతో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. గురువారం యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ పి.అనిల్‌కుమార్, యూసుఫ్‌గూడ సర్కిల్ మేనేజర్ యూసుఫ్ పాష, టెక్నికల్ అసిస్టెంట్ మహబూబ్ అలీతో కలిసి సర్కిల్ వ్యాప్తంగా సర్వే నిర్వహించారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో సర్వే పూర్తిచేసిన అధికారులు ప్రమాదకరంగా ఉన్న 31 చెట్లను గుర్తించినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్‌తో పాటు జోన్ పరిధిలో ప్రమాదకరంగా ఉన్న చెట్లను గుర్తించి వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించే పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

జోన్‌లో 115 చెట్లు గుర్తింపు..

ప్రమాదకరంగా ఉన్న చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగిస్తాం యూసుఫ్‌గూడ సర్కిల్‌తో పాటు శేరిలింగంపల్లి జోన్‌లో ప్రమాదకరంగా ఉన్న 115 చెట్లను గుర్తించాం. వాటిలో అత్యంత ప్రమాదకరంగా ఉన్న వాటిని ముందుగా తొలగిస్తాం. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ అనుమతి కోసం నివేదిక పంపిస్తున్నాం.

- డీడీ అనిల్‌కుమార్, శేరిలింగంపల్లి

సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి

కాటేదాన్‌లో సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

మైలార్‌దేవ్‌పల్లి, మే 30: కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో సీఐటీయూ ముందుండి పోరాడుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. సంస్థ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాటేదాన్ డంపింగ్ యార్డులో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డంపింగ్ యార్డు నుంచి చేపట్టిన భారీ బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కాటేదాన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులు చట్టాలను తెలుసుకొని తమకు దక్కాల్సిన హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్మికుల సమస్యల కోసం తాము ముందుండి పోరాడుతామన్నారు. కార్మికుల సమస్యలపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకునే అధికారులే కరువైయ్యారని ఆయన విమర్శించారు. కార్మికుల పని ప్రదేశాల్లో కమిషనర్ స్థాయి అధికారులు పర్యటించి సమస్యలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్, సహాయ కార్యదర్శి ఎస్.రామోహ్మన్‌రావు, రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు జి.కురుమయ్య, సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ ప్రవణ్‌కుమార్, కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి భాస్కర్, డంపింగ్ యార్డు రాష్ట్ర కమిటీ నాయకులు మోహన్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

వెంగళరావునగర్, మే 30: హాస్టళ్లలో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఆర్ నగర్ డివిజన్ ఏసీపీ పి.వెంకటరమణ అన్నారు. గురువారం ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్‌లో హాస్టళ్ల నిర్వాహకులతో పోలీసులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం హాస్టళ్ల నిర్వాహకులు చట్టానికి సహకారం అందించాలని కోరారు. హాస్టళ్లలో చోరీలు, నేరాల నిరోధానికి సీసీ కెమెరాలతో పాటు రిజిస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. హాస్టళ్లలో చేర్చుకునేముందు వారి ఆధార్ కార్డుల ప్రతులను ఫైల్ చేసుకోవాలని పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తూ హాస్టళ్లను నిర్వహించాలని అన్నారు. సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని సూచించారు. పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సమావేశంలో ఎస్ఆర్ నగర్ డివిజన్ ఏసీపీ పి.వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

వెలగని వీధి దీపాలు..

ఇబ్బందులు పడుతున్న స్థానికులు

మైలార్‌దేవ్‌పల్లి ప్రధాన రహదారిపై వెలగని వీధి దీపాలు

మైలార్‌దేవ్‌పల్లి, మే 30: ప్రధాన రహదారులతో పాటు బస్తీలు, కాలనీల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు నానా అవస్తలు పడుతున్నారు. వీధి దీపాలు సరిగ్గా పని చేయకపోవడంతో అనేక మంది ప్రమాదాల బారీన పడుతున్నారు. ప్రధానంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్, దుర్గానగర్, టీఎన్‌జీవోస్‌కాలనీ, మధుబన్‌కాలనీ తదితర బస్తీల్లో రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగక పోవడంతో ఒకింత భయంగుప్పిట్లో ఉన్నట్లు చెబుతున్నారు. 15 రోజులుగా సమస్య నెలకొని ఉన్నా వీటిని బాగుచేసేందుకు అధికారులు, సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీధి లైట్లు వెలిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముంపు ముప్పు తప్పదా!

- పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- నాలాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు

నాలాను పరిశీలిస్తున్న ఈఈ రాజ్‌కుమార్, డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు (ఫైల్)

జూబ్లీహిల్స్, మే 30: లోతట్టు ప్రాంతాల్లో ఈ ఏడాది ముంపు ముప్పు తప్పేలా లేదు. నాలాల్లో చెత్త, వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. జీహెచ్ఎంసీ బిల్లులు చెల్లించని కారణంగా కాంట్రాక్టర్లు పనులు చేపట్టకపోవడంతో నాలాల్లో పూడికతీతతో పాటు నిర్వహణ నిలిచిపోయింది. దీంతో పూడికతీత పనులు చేపట్టక నాలాలు, వరద కాల్వలు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. దీంతో యూసుఫ్‌గూడ సర్కిల్లో లోతట్టు ప్రాంతాలకు ముంపు ముప్పు తప్పేలా లేదు. ఇకనైనా జీహెచ్ఎంసీ అధికారులు కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించి పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీటి సమస్యను పరిష్కరించాలి

రాజామొహల్లా బస్తీలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్, మే 30: బస్తీలు, కాలనీల్లో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం రాజామొహల్లా బస్తీలో పర్యటించి ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న చేతిపంపులను పవర్ బోర్లుగా మార్చి, మంచినీటి సమస్యను తీర్చాలని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. నారాయణగూడ జలమండలి జీఎం రామకృష్ణ, మేనేజర్ మహేందర్‌రెడ్డితో చర్చించి పవర్ బోర్లుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.రామన్ గౌడ్, జక్కి.జగదీశ్, రితేశ్ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్, మే 30: కులాంతర వివాహం చేసుకున్నాడనే అక్కసుతో ఓ యువకుడిపై దాడిచేసి అతడి మృతికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారుపాక అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా, కోహిర్ మండలం, బడంపేట్ గ్రామానికి చెందిన బేగరి నర్సింలు మరోగ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి మే 1న పెండ్లి చేసుకున్నాడని తెలిపారు. యువతి కుటుంబీకులు ఈనెల 18న నర్సింలును పట్టుకొని అతడిపై దాడిచేయగా తీవ్రంగా గాయపడటంతో నర్సింలు కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తీసుకొచ్చారని తెలిపారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని వెల్లడించారు. మృతుడు నర్సింలు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలువాలని, కుల దురహంకార హత్యను ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు. హత్యపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రోడ్ల పక్కన చెత్తాచెదారాన్ని వేయొద్దు

ఇందిరానగర్‌లో ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న శానిటేషన్ సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు

బంజారాహిల్స్, మే 30: రోడ్ల పక్కన చెత్తాచెదారాన్ని పారవేయడం మానుకోవాలంటూ జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం సిబ్బందితో పాటు మహిళా సమాఖ్య సభ్యులు బస్తీల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ బస్తీలో గురువారం స్వచ్ఛతా కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్-18 ఏఎంఓహెచ్ డాక్టర్ రవి ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని చెత్త వేసే ప్రాంతాల్లో ప్రదర్శన నిర్వహించారు. ఇంటింటికీ స్వచ్ఛ ఆటో వచ్చి ప్రతిరోజూ చెత్తసేకరణ చేస్తుంటే కొంతమంది వ్యక్తులు మాత్రం రోజూ చెత్తను తెచ్చి రోడ్లపక్కన పారవేయడం సరికాదని ప్లకార్డులు ప్రదర్శించారు. ఇంటివద్ద స్వచ్ఛ వాహనంలోనే చెత్తను వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేసేవారిపై జరిమానాలు వేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ లవకుమార్, మహిళా సమాఖ్య నాయకురాలు దీపాదేవితో పాటు పలువురు సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై తాగుతూ.. మరొకరిపై దాడి

బంజారాహిల్స్,మే 30: నడిరోడ్డుపై నిలబడి మద్యం సేవిస్తుండటంతో పాటు రోడ్డుపై వెళ్తున్న యువకుడిపై కత్తితో దాడి చేసేందుకు యత్నించిన ఘటనలో రౌడీషీటర్ బిల్లా పవన్‌తో పాటు మరో ఇద్దరిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని ఇందిరానగర్ నివాసి హేమంత్ రెడ్డి ఈ నెల 28న అర్ధరాత్రి సమయంలో ముందులు తెచ్చుకునేందుకు తన గది నుంచి మెడికల్ షాప్ వరకు బయలుదేరాడు. కొంత దూరం వెళ్లాక.. రోడ్డుకు అడ్డంగా నిలబడిన ముగ్గురు యువకులు మద్యం సేవిస్తూ కనిపించారు. దీంతో వారివైపు చూస్తూ వెళ్తున్న హేమంత్‌రెడ్డిని దుర్భాషలాడటంతో పాటు తమ వద్ద ఉన్న కత్తితో దాడి చేసేందుకు యత్నించారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన హేమంత్‌రెడ్డి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ మేరకు బాధితుడు గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ ఘటనలో పాల్గొన్న యువకుల్లో ఒకరు మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ బిల్లా పవన్ అని పోలీసుల దర్యాప్తులో తేలింది. అతడితోపాటు శ్రావణ్, ప్రశాంత్ కూడా ఉన్నట్టు గుర్తించిన పోలీసులు.. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఐదుగురికి జీవితాన్ని అందించి..

దత్తలూరు విష్ణువర్ధన్ లాల్ (ఫైల్)

ఖైరతాబాద్, మే 30: తాను మరణించినా ఐదుగురికి జీవితాన్ని అందించారు. బేగంపేట ప్రకాశ్‌నగర్‌కు చెందిన దత్తలూరు విష్ణువర్ధన్ లాల్ (42) ప్రైవేట్ ఉద్యోగి. ఇంట్లో ఉండగా, ఒక్కసారిగా అపస్మారక స్థితిలో కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు సోమాజిగూడలోని యశోద దవాఖానలో చేర్పించారు. చికిత్స అందించినా ఎలాంటి ఫలితం లేదు. దీంతో ఈ నెల 29న బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసి జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. ఆయన శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు, కండ్లను సేకరించారు. అవసరమైన వారికి వాటిని అందజేస్తామని వైద్యులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

తేది: 30-05-2024

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా సమాచారమివ్వునది ఏమనగా నా క్లయింట్ దిగువ షెడ్యూల్ నందు వివరించబడిన ఆస్తి కొనుగోలుకు సంబంధించి సదరు ఆస్తి యజమానితో ఒప్పందం చేసుకోవడం జరిగింది. ఆస్తి వివరాలు మరియు యజమాని పేరు షెడ్యూల్ నందు వివరించబడినవి. నా క్లయింట్ పాక్షిక అమ్మక ప్రతిఫలం కూడా చెల్లించారు. ఒకవేళ ఎవరైనా వ్యక్తి షెడ్యూలు నందు వివరించబడిన ఆస్తి నందు ఏదైనా హక్కు, వాటా, టైటిల్, క్లెయిమ్స్, స్వాధీనత లేదా ఏ రకమైన ఆసక్తిని కలిగి ఉన్నచో వారు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి **ఏడు (7) రోజులలోగా** సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ సంతకందారుని సంప్రదించగలరు. **ఏడు (7) రోజులలోగా** ఏ విధమైన క్లెయిమ్స్ రానిపక్షంలో ఏ వ్యక్తికి సదరు షెడ్యూలు ఆస్తినందు ఏ విధమైన హక్కు లేదా క్లెయిమ్ లేదని భావించబడుతుంది మరియు నా క్లయింట్ మొత్తం అమ్మకం ప్రతిఫలాన్ని చెల్లించుట ద్వారా అవసరమైన డాక్యుమెంట్లు అనగా సేల్ డీడ్/AGPA మొ॥ రిజిస్ట్రేషన్‌తో ముందుకు సాగుతారు. ఆ తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ విధమైన క్లెయిమ్స్ అంగీకరించబడవు.

ఆస్తి షెడ్యూల్

ఆస్తి వివరణ	యజమాని పేరు
హైదరాబాద్, సోమాజీగూడలోని సర్వే నెం. 19లో ప్లాట్ నెం. 15పై నిర్మించిన **"హరిత అపార్ట్‌మెంట్స్"**లోని 1123 చ.గజాల మొత్తంలో అవిభాజ్య వాటా భూమి 70.187 చ.గజాలు లేదా 58.683 చ.మీటర్లతోపాటు స్టిల్ట్ ఫ్లోర్‌లో విస్తీర్ణం 146 చ.అడుగుల కారు గ్యారేజ్ నెం. 401, కామన్ ఏరియాలతోపాటు విస్తీర్ణం 1325 చ.అడుగుల మూడవ అంతస్తులో PTIN నెం. 1100616252తో మున్సిపల్ నెం. 6-3-906/15/401 కలిగిన ఫ్లాట్ నెం. 401.	**పడమటి సుందర కుమార్,** తండ్రి: P.నాగేంద్ర రావు, R/o. ఇం.నెం. 3-185, అమరావతి కరకట్ట రోడ్, మంతెన సత్యనారాయణరాజు ఆరోగ్యాలయం, వెంకటాపాలెం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్.

సం/- (V. మనోహర్ రావు), అడ్వకేట్

ప్లాట్ నెం. 399, రోడ్ నెం.81, ఫేజ్-3, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500 033, ఫోన్: 9346472367.